క్లుప్తంగా

ఘనంగా జీవ వైవిధ్య దినోత్సవం



చిత్రలేఖనంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

రాజానగరం: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా హెల్త్ సైన్స్ విద్యార్థులకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. జీవ వైవిధ్య పరిరక్షణపై చర్చాగోష్ఠి జరిపారు. అనంతరం చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పి.ఫణీశ్వర్, కె.సంధ్య, ఎస్.ఉమకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, డాక్టర్ ఏఎల్ శ్వేత ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ


ప్రభుచంద్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లోని మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రభుచంద్ కుక్కల పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ధన్‌బాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్)లో 'మేగ్నిటైజింగ్ రోస్టింగ్ ఆఫ్ లోగ్రేడ్ ఇమిటేట్ ఆర్అండ్‌బెనిఫికేషన్ బైమేగ్నిటిక్ సెపరేషన్ అండ్ రిజర్వు ఫ్లోటేషన్' అనే అంశంపై ఆయన పరిశోధన సమర్పించారు. దీనిపై ప్రభుచంద్‌కు పీహెచ్‌డీ లభించిందని జిజియు ప్రొ.వీసీ డాక్టర్ కేవీబీ రాజు తెలిపారు. హెచ్ఓడీ ఆచార్య శ్రావణ్ కుమార్ గైడ్‌గా వ్యవహరించారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 289 మంది హాజరు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షకు 289 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటిండెంట్ బి.సుజాత తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరిగిన ఈ పరీక్షకు 300 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. అలాగే బుధవారం జరిగిన పరీక్షకు 281 మంది మాత్రమే హాజరయ్యారని చెప్పారు. పరీక్ష కేంద్రం టెస్ట్ సెంటర్ అడ్మిన్ ఈ.రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన


పలివెల వీరబాబు

సీతానగరం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం తక్షణమే కూలి సొమ్ములు చెల్లించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఆయన గురువారం సీతానగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఎనిమిది వారాలుగా వేతనాలు విడుదల చేయకపోవడాన్ని తప్పు పట్టారు. పేదల శ్రమను ప్రభుత్వం లెక్క చేయకపోవడం బాధాకరమన్నారు. వారికి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వేతనాల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

20 లీటర్ల సారా స్వాధీనం


నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: ఈలకొలను గ్రామంలోని సారా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన కోట బుజ్జి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, మరో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్


గంజాయి, నిందితులను చూపిస్తున్న ఎస్సై రామారావు

పెదపూడి: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని ఎస్సై కె.రామారావు అన్నారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయిస్తున్నట్టు అందించిన విశ్వసనీయ సమాచారం మేరకు కరకుదురు శివారున మూతబడిన పాత వైన్‌షాపుపై ఎస్సై, సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా రామేశ్వరం గ్రామానికి చెందిన అవినాష్, వంశీ, ఆనంద్‌లను పట్టుకున్నారు. వారి నుంచి 5.152 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనితో సంబంధం ఉన్న మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేశారు.

గౌరవమెక్కడ!

- గౌరవ వేతనం విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- ఎంపీటీసీ సభ్యుల ఆవేదన
- టీడీపీ నాయకులకే అధికారుల ప్రాధాన్యం



బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం

బిక్కవోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సమయంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. 2024 జూన్‌లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దాదాపు 20 నెలల నుంచి వేతనాలు రావాల్సి ఉందని ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు.

సభ్యుల అసంతృప్తి

బిక్కవోలులో ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గౌరవ వేతనం మంజూరు చేయకపోవడంతో అధికార, విపక్షాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులందరూ అసంతృప్తితో ఉన్నారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులమైనా తమకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యం తమకు అధికారులు ఇవ్వడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడమే తప్ప.. తాము చెప్పిన ప్రజల సమస్యలను మండల అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అనపర్తి నియోజకవర్గం

మండలం	ఎంపీటీసీ సభ్యులు
అనపర్తి	20
బిక్కవోలు	20
రంగంపేట	17
పెదపూడి	20
మొత్తం	77

బిల్లు పెడుతున్నాం



బడ్జెట్ రావడంతో ఎప్పటికప్పుడు బిల్లు పెడుతున్నాం. త్వరలోనే వారి ఖాతాకు గౌరవం వేతనం జమ అవుతుంది.
– వి.శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలతో పాటు నిధులు, అలవెన్సులు కూడా ఇవ్వడం లేదు. ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్థోమత కలిగిన వారని ప్రభుత్వం పరిగణిస్తోంది. ఇప్పటికైనా గౌరవ వేతనాలు అందజేయాలి.
– సమ్మంగి దుర్గా ప్రసాద్, ఎంపీటీసీ, పెదపూడి

సూరారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ


సత్తి శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు

అనపర్తి: పితృ వియోగంతో బాధపడుతున్న పొలమూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు సత్తి కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వారి కుటుంబ సభ్యులను గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ప్రముఖ నేత్ర వైద్యుడు తేతల సత్యనారాయణరెడ్డి తదితరులు దివంగత సూరారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి (నేషనల్), అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పొలమూరు సత్తి సూరారెడ్డి బ్రదర్స్, అనపర్తి మాజీ జెడ్పీటీసీ సభ్యులు కర్రి ధర్మారెడ్డి (దొరబాబు) తదితరులు సత్తి సోదరులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల అగ్రిమెంట్ కొనసాగించాలి

పెదపూడి: గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థ అగ్రిమెంట్ 2027 జనవరి వరకూ ఉందని, దానిని ప్రభుత్వం కొనసాగించాలని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) వాహనాల ఆపరేటర్ల యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పెదపూడిలో తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎండీయూ వాహనాల వ్యవస్థను తొలగిస్తున్నట్లు మీడియా ద్వారా వస్తున్న ప్రకటనలు చూసి భయాందోళనకు గురయ్యామన్నారు. ప్రభుత్వం తమ అగ్రిమెంట్‌ను కొనసాగించకపోతే తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి హక్కులు సాధించకుంటామని హెచ్చరించారు. దీనిపై ఆధారపడి మండలంలో 16 మంది ఆపరేటర్లు, 16 మంది హెల్పర్లు, వారి కుటుంబ సభ్యులు జీవిస్తున్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా ఈ వ్యవస్థలో పని చేస్తున్నామన్నారు. తమను ఒక్కసారిగా రోడ్డున పడేస్తే భార్యాపిల్లలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాలన్నారు. దీనిపై ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సాంబత్తుల రవిచంద్ర, వాసంశెట్టి అప్పారావు, గాజంగి వీరబాబు, ఆచంట నాగేంద్ర, టీ.లక్ష్మీనారాయణ, ఎం.సత్తిబాబు, కె.శేఖర్, టీ.రాజు తదితరులు పాల్గొన్నారు.

పాశాలమ్మకు వెండి ఆభరణాల సమర్పణ


పాశాలమ్మకు వెండి కిరీటం సమర్పించిన భక్తులు


అమ్మవారికి ఆభరణాలను అలంకరిస్తున్న భక్తుడు

సీతానగరం: ముగ్గళ్ల గ్రామదేవత పాశాలమ్మకు భక్తులు గురువారం వెండి ఆభరణాలను సమర్పించారు. అమ్మవారి జాతర ఈ నెల 25 వరకూ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన నాదెళ్ల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం భార్య రమాదేవి, కుమారుడు వెంకట శ్రావణ్ కేజీన్నర వెండితో రూ 1.80 లక్షలతో ఈ కిరీటాన్ని తయారు చేయించారు. అలాగే గ్రామానికి చెదిన తమ్మన వీర వెంకట సత్యనారాయణ కుమారుడు నాగ రవికుమార్, కుమార్తె బి.కనక దుర్గ రూ.30 వేలు విలువైన వెండి ఆభరణాలు (వడ్డాణం, కళ్లు, బొట్టు, ముక్కు పుడక)ను సమర్పించారు. ఈ ఆభరణాలను భక్తుల సమక్షంలో అమ్మవారికి అలంకరించారు.

ఆయుర్వేద మొక్కలు నాటిన ప్రముఖులు


ఆయుర్వేద ఆశ్రమంలో మొక్కలు నాటుతున్న రవివర్మ తదితరులు

కోరుకొండ: కణుపూరు ఆయుర్వేద ఆశ్రమంలో వైద్యుడు రవివర్మ ఆధ్వర్యంలో గురువారం ఆయుర్వేద మొక్కలు నాటారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇక్కడ చాలా కాలంగా ఆయుర్వేద వైద్య ఆశ్రమాన్ని రవివర్మ నిర్వహిస్తున్నారు. బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వివాహితకు కట్నం వేధింపులు

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటకు చెందిన బాడిదబోయిన గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామానికి చెందిన బాడిదబోయిన వెంకటరమణతో 15 ఏళ్ల క్రితం గంగాభవానికి వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గంగాభవానిని భర్త వెంకటరమణ, అత్త లక్ష్మి, ఆడపడుచులు ఆదిలక్ష్మి, నిమ్మల నూకరత్నం, మంగమ్మ కొంతకాలంగా కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: కానవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. కానవరం, ఫరిజల్లిపేట ప్రజలకు పైన తెలిపిన సమయంలో విద్యుత్ ఉండదన్నారు.

అనపర్తి: కుతుకులూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో తీగలను తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపడుతున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.నటరాజన్ తెలిపారు. ఈ సందర్భంగా కుతుకులూరు, పెదపర్తి, పులగుర్తలోని ఇండస్ట్రియల్, వ్యవసాయ లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నర్సరీని సందర్శించిన ఎస్పీ

కడియం: మండలంలోని బుర్రిలంక గ్రామంలోని ఉమా పార్వతి నర్సరీని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో కొత్తపల్లి బ్రదర్స్ ప్రత్యేకంగాసృష్టించి పెంచిన ×టాల్ బోన్సాయ్₹ అనే 100 సంవత్సరాల వయసు ఉన్న వృక్షజాతి మొక్కను ఎలా తయారు చేశారో, దాని పెంపకానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు, అనంతరం వాటి పెంపకం గురించి కూడా ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి కడియం నర్సరీ రైతుల చేస్తున్న సేవలు చాలా విలువైనవన్నారు.

అధిక రక్తపోటుతో గర్భిణులకు అనర్థాలు


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి కోమల

ధవళేశ్వరం: గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పోటు పరీక్ష చేయించుకోవాలని, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల అన్నారు. ప్రపంచ ప్రీ ఎక్లాంషియా (గుర్రపువాతం , గర్భవాతం)డే దినోత్సవం సందర్భంగా ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోమల మాట్లాడుతూ గర్భిణుల్లో అధిక రక్త పోటు కారణంగా ఎక్లాంషియా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కిల్కారి మొబైల్ అకాడమీ (01244451660 నంబర్)నుంచి వచ్చే కాల్స్‌ను గర్భిణులు తప్పనిసరిగా వినాలన్నారు. జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు, పోషకాహారం, బిడ్డకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాల సమాచారం, కుటుంబ నియంత్రణ పద్ధతులను తెలియజేస్తారన్నారు. అలాగే టోల్ ఫ్రీ నంబర్ 14423 ద్వారా కూడా గర్భిణులు సమాచారం వినవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి డాక్టర్ జి.రోహిత, డీపీహెచ్ఎన్ వసంతలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, సీహెచ్‌వో కె.వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

అనపర్తి: రామవరంలో బుధవారం ప్రారంభమైన నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయ సాంఘిక నాటకాల పోటీలో రెండోరోజు గురువారం ప్రదర్శించిన మూడు నాటికలు ఆహూతులను అలరించాయి. బతికుండగానే బాధ్యతగా వ్యవహరించడంలోనే నిజమైన ప్రేమ ఉందని చెప్పే ఇతివృత్తంతో ప్రదర్శించిన చీకటి పువ్వు నాటికను కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ప్రదర్శించారు. దీనితో పాటు మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం, గుంటూరుకు చెందిన అమృత లహరి ఆర్ట్స్ థియేటర్ వారి నాన్నా నేనొచ్చేస్తా నాటికలు ఆకట్టుకున్నాయి.

శ్రీ ఆంజనేయం


రంగంపేట చినకొత్తూరులో భక్తులు


రాపాకలోని అభయాంజనేయస్వామి ఆలయంలో భజన చేస్తున్న మహిళా భక్తులు

- ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు
- ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు
- తరలివచ్చిన భక్తులు
- వాడవాడలా అన్నసమారాధనలు

అనపర్తి: హనుమజ్జయంతి పర్వదినాన్ని అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనపర్తి కెనాల్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో స్వామికి తమలపాకులు, సిందూర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓం సత్సంగం అధ్యక్షుడు మేడపాటి వెంకటరమణారెడ్డి, పడాల కళ్యాణ్ రెడ్డి, మేడపాటి శివశంకర రెడ్డి పాల్గొన్నారు.

- పాతఊరులోని బాపనమ్మ ఆలయం వెనుక గల ఆనంద నగర్‌లో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు నాగదేవర ఫణిశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఒంటె విగ్రహం సమర్పణ

జీబీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పీఆర్ఎల్ స్వామి దంపతులు హనుమంతుని వాహనమైన ఒంటె విగ్రహాన్ని స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ విగ్రహాన్ని ఆంజనేయస్వామి ముంగిట ప్రతిష్ఠించారు. అనంతరం ఆ విగ్రహానికి అభిషేకం చేశారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: పందలపాకలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని గారెలు, తమలపాకుల దండలతో అలంకరించారు. తొస్సిపూడిలోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద గొలుగూరి నారాయణరెడ్డి, చందన దంపతుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన జరిగింది. గొలుగూరి భారతి సేవ బృందం, సత్తి సత్యనారాయణరెడ్డి సంకీర్తనలు చేశారు. అనంతరం భారీ అన్నసమారధన నిర్వహించారు. కార్యక్రమంలోని జీఎస్ఎన్ రెడ్డి, తేతలి వెంకట్‌రెడ్డి, కర్రి శ్రీనివాసరావు, తేతలి రామభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొంకుదురు, బిక్కవోలు, ఊలపల్లి గ్రామాల్లో పూజలు జరిగాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని ఆంజనేయస్వామివారి ఆలయాలకు భక్తులతో పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాపాకలోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామికి ఆలయ అర్చకుడు పల్లేటి సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పఠించి, భక్తి కీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

- ముగ్గళ్ల ఇసుక ర్యాంపు వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకాన్ని అర్చకుడు ఆరాధ్యుల సాయి కుమార్ నిర్వహించారు. రామచంద్రపురానికి చెందిన శ్రీభక్తాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.
- పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, కూనవరం, కాటవరం, రాజంపేట, మునికూడలి, బొబ్బిల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి ఘనంగా జరిపారు.


తొస్సిపూడిలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు


అనపర్తిలో ఒంటె విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అభిషేకం చేస్తున్న స్వామి దంపతులు

రంగంపేట మండలంలో..

రంగంపేట: మండలంలోని చంద్రేడు, రంగంపేట, జి.దొంతమూరు, వడిశలేరు గ్రామాల్లోని హనుమంతుని విగ్రహాలను విశేషంగా అలంకరించి, తమలపాకులు, సిందూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగంపేటలోని పాతూరు శెట్టిబలిజ రామాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామికి రామాంజనేయ భజన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అభయ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు కోడూరి వెంకటరత్నం, నారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయ భజన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఆంజనేయస్వామి క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన సంఘం గురువు పోతుల వీరన్న, గారపాటి నరేష్, శ్రీను, దొరబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.


అనపర్తిలోని ఆనంద్ నగర్‌లో కొలువైన ఆంజనేయస్వామి


సంపరలో ఆంజనేయస్వామి

కోరుకొండ మండలంలో..

కోరుకొండ: మండలంలోని కోరుకొండ, బూరుగుపూడి జంక్షన్, శ్రీరంగపట్నంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలు జరిపారు. కోరుకొండలో స్వామివారిని బీజేపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి దర్శించుకున్నారు. ఆ పార్టీ నాయకులు తగరంపూడి గణపతి, పచారి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: సంపరలోని పంట కాలువ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, తమలపాకులు, సిందూరంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

= జి.మామిడాడ, పెదపూడి, రామేశ్వరం, సంపర, పెద్దాడ తదతర గ్రామాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు.


పందలపాకలో అభయాంజనేయస్వామి


ముగ్గళ్లలో అభయాంజనేయస్వామి